# నవరత్నాలు

**తలిశెట్టి సభాపతిరావు**

అవి భోజరాజు పరిపాలిస్తున్న రోజులు. ఆరోజుల్లో రత్నాల వ్యాపారం విరివిగా సాగుతూ వుండేది. ఇతరదేశాలనుండికూడా రత్నాలవ్యాపారులువచ్చి యథేచ్ఛగా రత్నాలను కొనడమూ, అమ్మడమూ కూడా వుండేది.

రానురాను ఈ రత్నాలవ్యాపారులలో మోసగాళ్లు బయల్దేరారు. ప్రజలను మోసంచేసి రత్నాలకు బదులుగా నకిలీరత్నాలను అమ్మి సొమ్ము చేసుకోవడం మొదలుపెట్టారు. కొన్నాళ్లు జరిగేటప్పటికి ఈసంగతి రాజుగారివరకూ వెళ్లింది. కాని రాజుగారు తొందరగా నమ్మలేదు. "అటువంటి మోసమే జరుగుతూవుంటే రత్నాల వ్యాపారం ఇంత ఉచ్ఛదశలోకి రావడానికి అవకాశమే లేదు. అయినా మేమే సొంతంగా ఈ విషయాన్ని పరీక్షించి, ఈ రత్నాలవర్తకుల నిజాయితీని తేలుస్తాము" అన్నారు సభలో.

* * *

ఒకరోజున భోజరాజు ముసలివేషంధరించి అంతఃపురంలోవున్న నవరత్నాలను ఒక సంచిలో వేసుకుని చేతికర్రతో దారి తడుముకుంటూ కోటలోనుండి బయల్దేరి రత్నాలవీధికి వచ్చారు. ఆరోజుల్లో రత్నాలూ, వజ్రాలూ అమ్మే బజారుకు రత్నాలవీధి అనేవారు.

దారితడుముకుంటూనే రత్నాలవీధిలో కొంతదూరంవెళ్ళి ఒక పెద్దకొట్టువద్ద ఆగారు.

"ఏం? తాతా! మంచి ఎండలో వచ్చావు. ఏం కావాలి?" అంటూ ఆకొట్టు యజమాని ప్రశ్నించాడు. ఆయనపేరు రత్నాలశెట్టి. తండ్రితాతలనుండీ రత్నాల వ్యాపారం చేస్తూ కోటికి పడగవెత్తినకుటుంబం. బజార్లో నమ్మకానికి పెట్టింది పేరు.

"ఏంలేదుబాబూ! నా దగ్గర కొన్ని రత్నాలుంటేను అమ్మజూపుదామని తెచ్చాను." అంటూ తడుముకుంటూనే బొడ్డులోవున్న సంచి తీసి రత్నాలశెట్టికి అందించారు.

రత్నాలశెట్టి సంచిలో రత్నాలను దోసిట్లో పోసుకుని పరీక్షించి ఆశ్చర్యపోయాడు. అంత ఖరీదైన నవరత్నాలనుచూసి చాలసంవత్సరాలైంది. ముసలివానివంక చూశాడు. పరధ్యానంగా వున్నట్లు కనిపించాడు. ఆ రత్నాలను ఎలాగైనా కాజెయ్యాలన్న దుర్బుద్ధి పుట్టింది.........

"తాతా! ఇవి ఎక్కడివి నీకు" అని ప్రశ్నించాడు.

"అయ్యో! నాకెక్కడివీ. మా తాతలకాలంనుండీ మా ఇంట్లో వుంటూవచ్చినయ్. ఈనాటికి మా సంసారం చిదికిపోయి, వాటి అమ్మే అవసరం వచ్చింది." అన్నాడ ముసలాయన ఎంతో బాధ పడ తూన్నట్లు.

"అయ్యో! పిచ్చితాతా! ఎంతో ఆశతో వచ్చినట్లున్నావు. ఇవి న రత్నాలు కావు. నకిలీవి. గాజ రాళ్ళతో సమానం. అంచేత వీటి



ఎవరు కొంటారు -ఇదిగో నీ సంచి. తీసుకు వెళ్లు" అంటూ సంచిని అందించాడు.

రత్నాలశెట్టి మాటలు ముసలి వేషంలో వున్న భోజరాజుకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించినవి. మనసులో ఎంతో ఆరాటం బయల్దేరింది. అయినా బయటకు కనపడనీయకుండా, సంచిని అందుకుని "ఇన్నాళ్లూ వీటిని నవరత్నాలనుకుని ఎంతో ప్రాణపదంగా చూశాను. నకిలీ రాళ్లేనా!" అంటూ లేచి "వెళ్లొస్తా బాబూ!" అంటూ దారి తడుముకుంటూ బయల్దేరాడు.

"కళ్లు కన్పించవు కాబోలు. జాగ్రత్తగా ఒక ప్రక్కనుండి వెళ్లు తాతా!" అంటూ తన అదృష్టానికి లోలోన పొంగిపోతూ, తాతను హెచ్చరించాడు.

తాత వెళ్లిన తర్వాత, తాను మార్చివేసిన నవరత్నాలను మళ్ళీ ఒకసారి కళ్లారా చూసుకుని, కళ్ళకద్దుకుని పెట్టెలో భద్రపరిచాడు.

ముసలివేషంలో వున్న భోజరాజు, కోటకు చేరి ఆత్రతగా సంచిలోని రత్నాలను తీసిచూశారు. ఆశ్చర్యం! అవి నవరత్నాలు కావు. వట్టి గాజురాళ్లు!! ఎంత మోసం? రత్నాలశెట్టి ఎంత నేర్పుగా నవరత్నాలనుమార్చి వేశాడు. బహుశా దృష్టిలేని ముసలివాడుకదా అని ఇంత దుర్మార్గానికి తలపెట్టి వుంటాడు. ఈ వర్తకప్రముఖునికి తగినట్టు బుద్ధి చెప్పాలని తలంచారు భోజరాజు.

* * *

ఈ సంఘటన జరిగిన మరుచటి రోజున, రాజావారు పట్టణంలో చాటింపు వేయించారు.

"మహారాణీవారి రాబోయే జన్మదినోత్సవ సందర్భంలో, మహారాజావారు ఒక నవరత్నఖచిత హారాన్ని బహూకరించ దలిచారు. అందుకు కావలసిన నవరత్నాలను తీసుకుని రత్నాల వర్తకులు ఫలాని రోజున దర్బారుకు హాజరు కావలసింది" అని.

ఈ చాటింపు విని రత్నాలశెట్టి ఆనందంతో గంతులు వేశాడు. ముసలివాడిని మాయచేసి సంపాదించిన నవరత్నాలకు తగిన వెల దొరుకుతుందికదా అని.

నిర్ణయించబడిన రోజుకు రత్నాల వర్తకులంతా, తమ తమ వద్దగల నవరత్నాలను తీసుకుని దర్బారుకు చేరుకున్నారు. అందరితోబాటు రత్నాలశెట్టి కూడా వచ్చాడు చక్కని ముఖమల్ సంచిలో మోసంచేసి సంపాదించిన నవరత్నాలను తీసుకుని.

రాజావారు రత్నాల పరీక్ష ప్రారంభించారు. వరుసగా వర్తకులంతా తాము తెచ్చిన రత్నాలను చూపించారు. రాజావారు అందరి వద్ద గల రత్నాలను పరీక్షించి, ఒక్క రత్నాలశెట్టి చూపించిన నవరత్నాలు మాత్రం నచ్చినట్లు ప్రకటించారు.

"రత్నాలశెట్టీ! నువు తెచ్చిన నవరత్నాలు మాకు నచ్చినవి. అంతఃపురానికి పంపించి, మహారాణీవారు కూడా సరేనంటే ఖరీదు ఖాయంచేద్దాము" అన్నారు.

"చిత్తం! మహాప్రభూ అలాగే


## బహుమతి రు. 500

(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్ల వెంట్రుకలను పోగొట్టుటకు

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మాసువాసనగల "మన మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0. 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-

GENERAL LABORATARIES,

(H. O) P. O Rajdhanwar. (H. Bagh).





# ★ నవరత్నాలు ★

కానివ్వండి" అన్నారు అమితానందంతో.

మరో పావు గంటకల్లా నవరత్నాలను అంతఃపురంలోకి తీసుకెళ్ళిన దాసి తిరిగివచ్చి "మహాప్రభూ! ఇవి నవరత్నాలు కావట. నకిలీరత్నాలు మాత్రమేనట. దేశమంతా గాలించి అయినా నవరత్నాలనే తెప్పించమని మహారాణీవారి కోరిక" అని వెల్లడించింది.

కోటి రత్నాల వర్తకులతో నిండివున్న నిండు దర్బారులో అలా ప్రకటన చెయ్యడం రత్నాల శెట్టికి తలకొట్టినట్లయింది.


రొమ్ము దగ్గు




దగ్గు, జలుబు, గొంతు నొప్పి, బ్రాంకైటిస్, ఆస్త్మా [illegible]

పెప్స్ సేవించండి.

PEPS



క్రిమి సంహారకరమైన గొంతు, రొమ్ము బిళ్ళలు.


[illegible]

"అదేమిటి ప్రభూ! అలా శెలవిచ్చారు అవి జాతిరత్నాలో రాళ్ళో ప్రభువులు ముందే చిత్తగించారుకదా! అవి నిసరైన జాతి రత్నాలు. అవసరమనుకుంటే ప్రభువులు మళ్ళీ చిత్తగించండి" అంటూ సంచిలోని రత్నాలను అరచేతిలో పోసుకున్నాడు.

పాపం! చేతిలో వున్నవి తాను తెచ్చిన నవరత్నాలు కాక, ఆనాడు ముసలితాత సంచిలో పోసి ఇచ్చిన నకిలీ రత్నాలు కావడంతో తెల్లబోయాడు. చేతులు వణికినవి. కాళ్ళకింద భూమి ఆడుతున్నట్లైంది. జరిగిన మార్పును అర్థం చేసుకోవడానికి అతనికి ఎంతో సేపు పట్టలేదు. ఆనాటి తాత ఎవరో? అన్న సందేహం కలిగేసరికి అతనికి గుండె ఆగిపోయింది!!

భోజమహారాజు, రత్నాల శెట్టిలో వచ్చిన మార్పును జాగ్రత్తగా చూస్తూనే వున్నారు.

"ఏం శెట్టీ! అలా అయిపోయావు. ఏం జరిగింది" అన్నారు.

"ఏం లేదు ప్రభూ! ఏం లేదు. కంపైతే కళ్ళొస్తాయి" అన్నాడు తల వంచుకుని.

పాపం! రత్నాలశెట్టి అవస్థ చూసి భోజరాజుకు పట్టరాని నవ్వు వచ్చినా ఆపుకుని "సరే!" అన్నారు.

రత్నాలశెట్టి బ్రతికానుదేవుడా అనుకుని బయల్దేరాడు. నాలుగడుగులు వేశాడో లేదో మహామంత్రి లేచి "ఆగవోయ్! శెట్టీ!" అని గద్దించాడు.

రత్నాలశెట్టికి పీకనొక్కినంత పనైంది. అక్కడే అలాగే నిలబడిపోయాడు!

"ఏం శెట్టీ! ఇప్పటికైనా నువ్వు చేసిన మోసాన్ని ఒప్పుకుంటావా? లేదా?" అన్నారు.

"చిత్తం! బుద్ధి గడ్డి తిన్నది. ప్రభువులు కరుణాసముద్రులు. రక్షించాలి" అంటూ మహారాజు గారి కాళ్ళమీద పడ్డాడు.

అప్పుడు మహారాజు లేచి దర్బారులో వున్నవారందరికీ జరిగినదంతా వివరంగా చెప్పి ఇలా అన్నారు "ఈ రత్నాలశెట్టి చేసిన మోసానికి తగినట్లు బుద్ధిచెప్పాలనుకున్నాం. అందుకే ఈ పథకం ఏర్పాటుచేశాం. మా నవరత్నాలు మాకు సురక్షితంగా చేరినవి. ఇతనికి కోటి వర్తకుల్లో తగిన పరాభవం అయింది. ఈ విషయం వాడవాడలా దేశదేశాలా తెలుస్తుంది. అతని కా శిక్ష చాలని మా అభిప్రాయం. కాని, ఇకముందు ఇలాంటి మోసాలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే ముక్కూ చెవులూ కోయిస్తాం. జాగ్రత్తగా వ్యవహరించండి" అంటూ దర్బారు చాలించారు.

అది విన్న వర్తకులంతా భయంతో ఎవరి ముక్కు, చెవులను వారు తడుముకున్నారు!!

మహారాజు అన్నట్లే రత్నాలశెట్టి మహారాజును మోసగించిన విషయం దేశదేశాలు ప్రాకింది. అతడు మోసగాడన్న సంగతి తెలిసిన తర్వాత అతని వ్యాపారం క్షీణించింది.—

★


96"×54"
కాశ్మీర్ శాలువ
ధర రు. 2-8-0.
వెంటనే వ్రాయండి.
GENERAL SUPPLY Co.,
(A. P. M.) Lal Kuan Delhi.